

# ఆసరేదో

వెజల మంజుల

ఇందిర గోల పడలేక ఐదు గంటలు కావడానికి ఇంకా పది నిముషాలుందనగానే సీటు సర్దేసింది నిర్మల. కింది ఫ్లోర్‌లో ఉన్న రమను పిల్చుకుని బయటకు వచ్చారు. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. పక్షులన్నీ గుంపులు గుంపులుగా రెక్కలు చప్పుడు చేసుకుంటూ వెడుతుంటే చూసేందుకు గమ్మత్తుగా ఉంది. రోజూ చూస్తూనే ఉన్నా ఎప్పటికప్పుడే ఆ దృశ్యం కొత్తగా అనిపిస్తుంది.

"ఇందూ! నడిచే వెళ్దామే ఈ రోజు. చల్లటి గాలి చాలా బాగుంది" అన్నది నిర్మల.

దార్లు వేరుకావడంతో కొంతదూరం రాగానే ఎవరి తోవన వాళ్లు బయలుదేరారు.

"ఏరా! ఈ బ్యూటీని చూడు. ఎంత నేచురల్‌గా ఉందో! కాకపోతే బొట్టు, పూలు లేని లోపం మాత్రం తెలుస్తూనే ఉందిరా" పక్కనే మాటలు వినిపించడంతో ఆలోచనల నుంచి బయటకొచ్చి నడకవేగం పెంచింది నిర్మల.

"అయితే అవి నేనిస్తే తీసుకుంటుందేమో అడగరా!"

"భలేవాడివి మామా! మరీ అంత స్వార్థం పనికిరాదు. గాజులు నువ్విచ్చుకో. పూలు నేనిస్తాను."

"ఒరేయ్! అలా అనకురా. ఏమిటోగా ఉంది. అన్నా అను చాలు నువ్వు."

"అబ్బా! ఆపండిరా మీ వెధవగోల. ఎప్పుడూ కీచులాటేనా! మొత్తానికి ఆడది ఆడదేరా, సఖ్యంగా ఉన్నవాళ్ల మధ్య చిచ్చు పెట్టడానికి."

"గొడవ ఎందుకుగానీ, ద్రౌపదిలా నలుగురినీ చేసుకుంటుంధేమో అడిగితే పోలా!"

మగదక్షత లేదు. భర్త లేడని తెలిస్తే చాలు ప్రతి వెధవా ఏదో వంక పెట్టుకుని మాట్లాడాలంటాడు. జాలి పడుతున్నట్లు నటిస్తూనే అవకాశం కోసం గోతికాడ నక్కలాగా కాచుకునుంటాడు. అందరికీ లోకువే ఈ విధవ బ్రతుకు. నడచివెళ్లాలని కోరిక కలిగినందుకు తనను తాను తిట్టుకుంటూ వడివడిగా నడిచింది నిర్మల.

★ ★ ★

"అమ్మా, బాబేడి?" రోజూ ఎదురు చూస్తూ కనిపించే కొడుకు కనిపించకపోయేసరికి తల్లి నడిగింది ఇంట్లోకి అడుగు పెడుతూ నిర్మల.

"ఆడుకోవడానికి వెళ్లాడు కానీ, నువ్వు ముఖం కడుక్కొని రా. కాఫీ ఇస్తాను" అంటూ వంటింట్లోకి నడిచింది అనసూయమ్మ.

"బాబూ! మల్లెపూలబ్బాయ్, ఇలారా" కోడలు వైదేహి మాట వినిపించడంతో వంటింట్లోకి వెళ్లబోతూ హడావిడిగా వెనక్కొచ్చింది అనసూయమ్మ.



# సహనమయి

"అమ్మాయ్ వైదేహి, నిర్మల వచ్చిందే. పూలవాడిని పిలుస్తావ్. అది బాధ పడుతుందని చెబితే వినవు కదా!" కూతురెక్కడ వింటుందోనని మెల్లగా అంది అనసూయమ్మ.

"మీ అబ్బాయి బ్రతికుండగానే ఇలా నీ కూతురుకోసం నన్ను పూలు పెట్టుకోవద్దనడం ఏమైనా బావుందా? నాక్కూడా ఆ అమ్మాయిని చూస్తే జాలే. అలాగని నా కోరికను పూర్తిగా చంపేసుకోలేను." నిదానంగానే అయినా కచ్చితంగా చెప్పింది వైదేహి. "పైగా ఈ రోజు మీ అబ్బాయి సినిమాకు తీసుకెళ్తానన్నారు." అంది వైదేహి.

వద్దనుకున్నా వదిన మాటలు వినిపిస్తూనే ఉన్నాయి నిర్మలకు. "వదినా! నువ్వేం అనుకోకు. అమ్మకు ఈమధ్య చాదస్తం ఎక్కువైంది. అమ్మా చెప్తే వినిపించుకోవు కదా! లోపలకు రా" అంటూ చెయ్యి పట్టుకుని లాగింది నిర్మల.

"ఇంట్లో నిన్ను పెట్టుకుని వీళ్లకు సినిమాలు, షికార్లూనూ" గొణుగుతూ నడిచింది అనసూయమ్మ.

"అంతే, అందరూ నన్నే అంటారు. అయినా ఇదంతా నా కర్మ. వేరే ఇల్లు చూడండి వెళ్దాం అంటే ఆయన వినరు. ఒక ముద్దూ ముచ్చట లేదు నా బ్రతుక్కు. దానికి మొగుడు లేకా ఒకటే, నాకు వుండీ ఒకటే లాగా వుంది" ఉక్రోషంతో పలికింది వైదేహి. లోపలకు వస్తున్న సుధాకర్‌కి ఆ చివరమాటలు విన్పించాయి.

"వైదేహి ! ఏమిటా మాటలు. నిర్మల గురించేనా ! వింటే బాధపడుతుంది. అయినా రోజురోజుకు ఇలా తయారవుతున్నావేమిటి" మందలించాడు భార్యను సుధాకర్.

"అంతే అందరూ ఆవిడ గురించి బాధపడేవాళ్లే. నా సంగతి ఆలోచించరు" అంటూ ఏడుపు మొదలెట్టింది వైదేహి.

* * *

పడుకున్నదన్న మాటేగానీ నిర్మలకు కంటి మీద కునుకు రావడంలేదు. దాంతో కోతి మూక అల్లరి, ఇంట్లోకి రాగానే ఈ విధంగా జరగడంతో మనసంతా కలచివేసినట్లైంది. తెలియకుండానే కంటనీరు కారిపోతుంది. భగవంతుడా ! నేను చేసిన తప్పేంటి ఆక్రోశిస్తుంది మనసు. అక్కడ అత్తారింట్లో చూస్తే "చెట్టంత కొడుకును పొట్టనపెట్టుకున్నావు" అంటారు, నేనేదో ఆయన్ని చంపేసినట్లు. నిజానికి ఆయనలేని లోటును ఎక్కువ అనుభవించేది తనే. అది అర్థం చేసుకోరు. ఆ బాధలు పడలేక ఉద్యోగం పేరుతో అమ్మగారింటి కొస్తే ఇక్కడ ఇంకో రకం బాధ. పెనం మీద నుండి పొయ్యిలోపడ్డట్లుగా వుంది పరిస్థితి.

* * *

10.30 అవుతుండగా హడావుడిగా వచ్చింది. సంతకం పెట్టేసి సీటుకు వెళ్లిపోయింది. ముఖం చూస్తే బాగా ఏడ్చినట్లుంది. ఏమైందో అనుకుంటూ తన కిచ్చినపని పూర్తి చేసుకుని నిర్మల దగ్గరకెళ్లి "నిర్మలా ! తలనొప్పిగా వుంది. అలా కాంటీన్ కెళ్లి కాఫీ తాగివద్దాం రావే" అని పిలిచింది ఇందిర.

ఇద్దరూ క్రిందకు దిగి రమను పిల్చారు. కుంటుతూ వస్తున్న రమని చూసి 'ఏమైందని' అడిగింది ఇందిర. 'ప్రొద్దుటే ఆ బోడి బామ్మను చూశానా, ఇలా అయింది' అనేసి పక్కనే ఉన్న నిర్మలను చూసి నాలిక్కరుచుకుంది రమ. మాట మారుస్తూ 'ఇందిరా! ఏమైందే నిమ్మీ అలా ఉంది. ఏడ్చిందా?" మెల్లగా అడిగింది రమ.

'నాకూ తెలీదు. ఉదయం లేటుగా వచ్చింది. అయినా మన ఆఫీసర్లలో ఏడ్చేలా తిట్టేంత కర్కోటకులు ఎవరూ లేరు. అయినా ఎందుకేడుస్తుందో అర్థం కాలేదు. ఏం నిమ్మీ! మాతో చెప్పగూడని విషయమా!' అడిగింది ఇందిర.

అయ్యో అదేం కాదు. అయినా ఎవరైనా ఆర్చేవాళ్ళా తీర్చేవాళ్లా, నాకర్మ నేను అనుభవించాల్సిందే నిరాశగా అంది నిర్మల.

నీ సమస్యను తీర్చగలమా, లేదా అని కాదు. బాధను పంచుకుంటే తగ్గుతుందని అడిగాము అంది రమ. జరిగినదంతా చెప్పింది నిర్మల గుడ్ల నీరు కుక్కుకుంటూ 'నిమ్మీ! నీ కష్టాలన్నింటికి మీ ఆయన పోవడం కారణం అయినా, ఇప్పుడున్న నీ సమస్యలకు నేచేత తీయించేసిన బొట్టు పూలు కారణమనిపిస్తున్నాయి. అందరి జాలి నీకు బాధ అన్పించేటపుడు, అవతలి వాళ్లకు అవకాశాన్ని కలిగిస్తున్నప్పుడు ఎందుకు అలా ఉండడం. ఇంత చదువుకున్న రమ కూడా ఎలా అందో విన్నావుగా. దాన్ని తప్పు పట్టాలని అనడం లేదు. పెరిగిన వాతావరణం అలాంటిది. ఎంత చదువుకున్నా, ఇవన్నీ మన రక్తంలో జీర్ణించుకుపోయాయి. మన ఆలోచనల్లో మార్పురావాలి. అందుకే గాజులు, పూలు, బొట్టు అన్నీ పెట్టుకో అంది సాలోచనగా ఇందిర. వింతగా చూశారు రమ, నిర్మల. హలో! నువ్వు ఈ లోకంలో ఉండే మాట్లాడుతున్నావా? అలాచేసి ఈ సమాజంలో మనగలమనే అనుకుంటున్నారా! అన్నది రమ.

ఎన్నాళ్ళుగానో వస్తున్న ఆచారం. ఎదిరించి నిలబడగలమా?! ఆలోచిస్తూ అంది నిర్మల 'మేడమ్! ఇందిరా మేడమ్‌కు ట్రంక్ కాల్ వచ్చిందిట. సార్ రమ్మంటున్నారండి' మెసెంజర్ వచ్చి చెప్పడంతో 'మీరు నెమ్మదిగా రండి. మళ్ళీ లంచ్ టైమ్‌లో మాట్లాడుకుందాం. అంటూ పరుగెడుతున్నట్లుగా బయలుదేరింది ఇందిర.


★ ★

మీ మామయ్య శ్యామ్ సుందరట, మీ బాబాయి రామారావు గారు ఈ రోజు ఉదయం చనిపోయారట. మేసేజ్ చెప్పమని ఫోన్ పెట్టేశారు. అంటూ చావు కబురు చల్లగా చెప్పారు ఆఫీసర్. 'షాక్ తిన్నట్లుగా నిలబడిపోయింది. "ఇందిర" చూడమ్మా నువ్వు వెళ్ళు' అంటూ పర్మిషన్ ఇచ్చారు ఆఫీసర్. 'థాంక్యూ సర్' అని చెప్పేసి గబగబ సీటు సర్దేసి తాళాలు ఇచ్చేసింది. 'నిర్మలా! మా బాబాయి చనిపోయారట. రేపు లీవ్ నేను. ఎల్లుండి హాలీడే కదా. గురువారం వచ్చేస్తాను. రమకు చెప్పు' అంటూ హడావిడిగా బయలుదేరింది.

★ ★

రూముకెళ్ళి రెండు డ్రస్సులు గబగబ సర్దుకుని బస్సెక్కింది. కళ్ళు మూసుకున్నా నిద్రరావడం లేదు. మనోనేత్రం ముందు రామారావు బాబాయి, శ్యామలపిన్నే కనిపిస్తున్నారు. 'ఏమోయ్.....ఆ......నిన్నే' రామారావు పిలుస్తున్నాడు శ్యామలను.

'బాబాయ్, నాకో అనుమానం. నువ్వే పిలిచి, నువ్వే ఆ... అంటావెందుకు' ఇందిర. 'మరేం లేదురా. మాపెళ్ళైన కొత్తల్లో అంటే మీ పిన్నమ్మకు 12 సంవత్సరాల వయసు ఉన్నప్పుడు ఏమోయ్ 'అంటూ పిల్చి ఇలారా అన్నట్లుగా సైగచేశానురా. మీ పిన్నమ్మ నావైపు తిరిగి 'ఏరా! నన్నేనా పిల్చావు' అంది. అంతే! ఆ రోజు మొదలుకుని మీ పిన్నమ్మను పిల్చినా సమాధానం చెప్పే అవకాశం ఇవ్వకుండా ఇలా అలవాటు చేసుకున్నాను అన్నాడు రామారావు.



"రామనాథంగారు! మీ అబ్బాయికి "ఎమ్. సెట్."లో సీటు రాలేదు కదా! ఇప్పుడేం చేస్తున్నాడు!" అడిగాడు విశ్వనాథం.

"ఈ మధ్యే ఎమ్. సెట్. కోచింగ్ సెంటర్ తెరిచాడండీ!" చెప్పాడు రామనాథం.

— ఎస్. అశోక్, సత్తుపల్లి.

ఆ మాటలు నమ్మొద్దురా, ఇందూ! అసలు సంగతి అది కాదు. ఏమోయ్, గీమోయ్ అంటే పలకను పేరు పెట్టి పిలిస్తేనే పలుకుతానన్నాను అందుకని అలా అలవాటు చేసుకున్నారు" శ్యామల.

"నిజమే కదా! లక్షణంగా పేరుపెట్టి పిలవచ్చు కదా. నేను కూడా ఒక్కసారైనా విన్లేదు మీరు పిన్నమ్మను పేరుపెటి పిలువగా" అంది ఇందిర.

"నిజం నాన్నా! అమ్మమ్మా వాళ్ళింటికి వెళ్ళకపోతే, నాక్కూడా అసలు అమ్మ పేరు తెలిసేది కాదు" ఇందిరకు వంత పాడుతూ చెప్పాడు సురేష్.

"చాల్లేర్రా గడుగ్గాయి! అంటూ కొడుకు నెత్తిన ఓ మొట్టికాయవేసి అది కదే ఇందూ! అందరం కలిసి ఉండే ఇల్లాయే. పెద్దవాళ్ళంతా ఎవరూ పేర్లుపెట్టి పిలవరాయే. నాకు పిలవాలనీ సరదాగా ఉన్నా, నవ్వుతారేమో అన్నట్లు నేను వాళ్లదార్లోనే నడిచాను. మీ పిన్నమ్మ పలకనంది కనుక నేనే పలకడం అలవాటు చేసుకున్నాను" అన్నాడు రామారావు నవ్వుతూ. పిన్నికి, అత్తగారి ఊరు ఒకటే కావడంతో ఎప్పుడూ బాబాయిని వదలి ఉండాల్సిన అవసరం రాలేదు. కూతురి పెళ్ళిచేశాక ఆ కూతురు దగ్గర కూడా ఒకటి రెండు రోజులకంటే ఎక్కువ ఉండేది కాదు. ఒకవేళ ఉండాల్సి వచ్చినా బాబాయి వెంటవెళ్లేవారు.

"ఏం బావా! మా చెల్లెనొదిలి ఒక్కరోజు కూడా ఉండలేవా" అంటూ శ్యామ్ మామయ్య ఆట పట్టించేవారు. అసలు పిన్నిని వదలి ఉండలేని బాబాయి ఇప్పుడు పిన్నమ్మను ఒంటరిని చేసి తిరిగిరాని తీరాలకు వెళ్లిపోయాడంటే నమ్మబుద్ధి కావడం లేదు. ఎప్పుడూ పిన్నమ్మ పెద్దబొట్టు పెట్టుకుంటుంది.

"పిన్నమ్మా! ఇంకొంచెం చిన్నదిగా పెట్టుకోవే నీకు నప్పుతుంది" అంటే "వద్దమ్మా! మీ బాబాయికి ఇలా పెట్టుకోవడమే ఇష్టం" అనేది శ్యామల పిన్నమ్మ. బాబాయికి తోటపనంటే చాలా ఇష్టటం. ఇంటిచుట్టూ రకరకాల పూలచెట్లు పెంచారు. ఉదయాన్నే పూలన్నీ ఆయనే కోసిచ్చేవారు. ఏరోజూ పిన్నమ్మ తలలో పూలులేకుండా చూడలేదు. సన్నజాజులుంటే బాబాయికి చాలా ఇష్టం.

"మీ పిన్నమ్మ మనస్సు కూడా ఇలాగే స్వచ్ఛమైంది. సుకుమారమైందిరా. ఇప్పుడిలా ఉంది కానీ ఒకప్పుడు ఈ సన్నజాజి మొగ్గలాగే నాజూగ్గా ఉండేది" అనేవారు రామారావు శ్యామలకు వినిపించేలా.

"ఆ... మరే. మీరు మాత్రం ఇంకా నవమన్మధుడు, బాలాకుమారుడు అనుకుంటున్నారా" అంటూ చెప్పేది శ్యామల.

ఎప్పుడూ నవ్వుతూ నవ్వించే బాబాయి లోటును కొడుకులు, కూతుళ్ళు ఎవ్వరూ తీర్చలేరు. మరి, పిన్నమ్మ ఈ బాదనెలా భరిస్తుందో. మనవాళ్ళు సంప్రదాయం అంటూ అన్నీ తీసేయమంటారు.

"ఆయనే పోయాక ఇవన్నీ నాకెందుకని" తీసేస్తుందా పిన్నమ్మ. మరి ఇన్నాళ్ళూ బాబాయికి . ఇష్టమైనరీతిలోనే బ్రతికింది. ఆయన చనిపోతే అంతటితో ఆ ఇష్టాలను వదిలివేస్తుందా. ఏ భర్తైనా తన బార్య ఎప్పుడూ కళకళలాడుతూ ఉండాలనే కోరుకుంటాడు. ఆత్మలున్నాయని నమ్ముతూ ప్రతి సంవత్సరం తద్దినాలు పెడుతూ కూడా, బర్త చనిపోయిన వెంటనే ఆయన కోర్కెకు వ్యతిరేకంగా భార్యను కళా విహీనం చేసి ఆయన ఆత్మను క్షోభపెట్టడంలో అర్థం లేదు. తనలో తనే తర్కించుకుంటూ ఉంది ఇందిర. ఆలోచనల్లోనే ఊరొచ్చేసింది.

★ ★ ★

అందరూ దగ్గర్లోనే ఉండటంతో వచ్చేసి ఉన్నారు. రామారావు అంతిమయాత్ర మొదలైంది. శ్యామలను ఆపడం ఎవరి వల్లా కావడం లేదు. నలుగురైదుగురు పట్టుకుని ఇంట్లోకి తీసుకొచ్చి స్నానం చేయించి రూమ్‌లో కూర్చోబెట్టారు. ముఖ్యమైన వాళ్లు తప్ప అందరూ వెళ్లిపోయారు. లీవ్ పెట్టి వచ్చింది కనక ఇందిర ఆగిపోయింది.

★ ★ ★

పెద్ద కొడుకులిద్దరూ దినకర్మ చేస్తున్నారు. మూడు రోజులు గడిచిపోయాయి. అందరూ యదావిదిగా పనులు చేసుకుపోతున్నారు. శ్యామలను మాత్రం ఒంటరిగా గదిలోఉంచేశారు. ఇందిర వెళ్తానన్నా "తాకకూడదు, మైల" అంటూ ఆపేశారు. పెదనాన్నను అడిగింది ఇందిర. "మన ఆచారం" రామారావు అన్న బలరామయ్య. "ఇదేం ఆచారం పెద్దనాన్నా! భర్త చనిపోయి ఆవిడ బాధపడుతుంటే, నలుగురం దగ్గరుండి మనలో కలుపుకుని బాధను మరిపించాల్సిందిపోయి, ఇలా బాబాయి చావుకు ఆమె కారణమన్నట్లుగా గదిలో ఏకాకిగా వదిలేసి ఒంటరితనమనే శిక్షను వేస్తున్నారు. పైగా పరామర్శ పేరుతో ఇంకా ఏడిపిస్తూ శాడిస్టుల్లాగా ప్రవర్తిస్తున్నారు" అంది ఆవేశంగా, ఇందిర.

"ఏమిటే ఇందూ! మన ఆచారాలు, సాంప్రదాయాలనే విమర్శించేంత దానివైనావా?" కొంచెం ఎగతాళిగా అన్నారు ఇందు మామయ్య శ్యామసుందరం.

"మామయ్యా! నీకు కోపం రాదంటే ఒక మాటడగనా?" అంటూ సమాదానం కోసం ఎదురుచూడకుండానే "కులాంతర వివాహం మన ఇంటా వంటా లేదంటూనే ప్రసాద్ బావ పెళ్లి నామోదించావు. కూతురు పరీక్షల్లో ఫెయిల్ అవుతుందేమోనని పెద్దమనిషి అయినా స్కూలుకు పంపించారు. కోదలు కన్నప్పుడు ఇల్లు ఇరుకుగా ఉందని ఇంట్లో కలిపేశారు. మీరు చేసింది తప్పు అనడం లేదు. అప్పట్లో ఆచారాలు ఎందుకోసం పెట్టినా, ఇప్పుడు మన అవసరాల మేరకు సర్దుబాటు చేసుకుంటున్నాం కదా!" అంది ఇందిర.

"అయితే ఇంతకూ నువ్వు అనేది ఏమిటే!" అంది శ్యాంసుందరం భార్య లీలావతి.

"ఏం లేదత్తయ్యా! పిన్నమ్మ నొక్కదాన్నే అలా 'మైల' అంటూ వేరుచేయడం బాగాలేదు. పైగా 'గాజుపూస' అంటూ మీరు చేసే తతంగం ఆపేస్తే బాగుంటుంది" అని తను చెప్పదల్చుకున్నది చెప్పేసింది ఇందిర.

"నా మనసులో మాట కూడా అదే అక్కా! కాకపోతే మీరేమంటారోనని నేను బయటపడలేదు." అన్నది ఈ ఆచారాలంటే గిట్టని లీలావతి తోటికోదలు కాత్యాయని.

"అమ్మాయిలూ, మా ముందు అంటే అన్నారు గానీ, మీ అమ్మమ్మ, బామ్మ విన్నారంటే తన్ని తగలేస్తారు" బయపెడుతున్నట్లుగా బలరామయ్య.

"వాళ్ల సంగతెలా ఉన్నా ముంది మీకు ఇష్టం లేనట్లుంది" అని "ఏం మామయ్యా" అంటూ శ్యాసుందరంను అడిగింది ఆయన మనసులో విషయాన్ని తెలుసుకోవాలని ఇందిర.

"ఎంత మాటన్నావే ఇందూ! ఈ చేతుల్లో ఎత్తుకుని ఆడించాను శ్యామలను. తిరుణాళ్ల కెళ్లినా, టౌనుకెళ్లినా రంగురంగుల గాజులు తెచ్చి దానికి వేసి చూసి మురిసిపోయేవాడిని. ఈ రోజు వరకూ కూడా దానికి ప్రతి పుట్టినరోజుకు చీర, పసుపు కుంకుమలు ఇవ్వందే నాకు తృప్తి ఉండదు. అలాంటి నన్ను ఎంత తప్పుగా అర్థం చేసుకున్నావే. ఏ అన్న అయినా తన చెల్లెలకు ఇలా జరగడం ఇష్టపడదు. తన చేతులతో చెల్లెలకు తెల్లచీర ఇవ్వాలని ఆశపడదు. రేపు జరగబోయేది తల్చుకుంటే నా గుండె తరుక్కుపోతోంది" అన్నాడు కంటనీరు తుడుచుకుంటూ శ్యాంసుందరం.

"బావగారూ! ఇంత బాదపడుతూ, మీ మనసుకు నచ్చని పని చేయడం ఎందుకు?" ధైర్యం పుంజుకుని అడిగింది కాత్యాయని.

వీళ్లు ఈ అచారాన్ని మంటగలిపేలా ఉన్నారనుకుని "అదేంటమ్మాయ్ అలా అంటావు. సమాజంలో బ్రతుకుతున్నప్పుడు

దాని ఆచారాలు, సంప్రదాయాలు పాటించాలి, మన్నించాలి ఎలా కాదనగలం?" అన్నాడు బలరామయ్య.

"ఇంతకూ అసలు ఈ ఆచారాన్ని ఎందుకు పెట్టారంటారు?" కొరకొర చూస్తూ అడిగింది ఇందిర.

"ఎందుకేమిటి, అందవికారంగా చేస్తే పర పురుషుడి కళ్లు ఆమెమీద పడవని." చెప్పాడు బలరామయ్య.

"అది అప్పటి మాట. కానీ పునర్వివాహాన్ని ఆమోదిస్తున్న ఈ రోజుల్లో ఇంకా ఈ ఆచారాన్ని పాటించడంలో అర్థంలేదు. అదీగాక మీ రోజుల్లో ఉమ్మడి కుటుంబాలుండేవి. చిన్న వయసులోనే మా నాన్నగారు పోయినా ఈ రోజు వరకు మా అమ్మను శ్యాంసుందరం మామయ్యే చూసుకుంటున్నారు. నాకు చదువు సంధ్యలు చెప్పించి నా కాళ్లమీద నిలబడేలా చేశారు. కానీ ఇప్పుడు స్వార్థం పెరిగిపోయింది మనుషుల్లో. నేను, నా కుటుంబం అంటూ వేరు కాపురాలు పెట్టేస్తున్నారు. ఎవరి సంసారం వాళ్లదే. అప్పటి ప్రేమలూ, అభిమానాలూ ఇప్పుడు లేవు. భర్త చనిపోతే ఆమె భుక్తికోసం బయటకు రాకతప్పడంలేదు. ఆ రోజుల్లో స్త్రీకి ఉన్నత స్థానం ఇచ్చి గౌరవంగా చూసేవారు. కానీ ఇప్పుడలా కాదు. నా కొలీగ్ ఉంది. భర్త చనిపోతే ఆ అమ్మాయికి ఉద్యోగమిచ్చారు. చూడగానే తెలిసిపోతుంది భర్త లేడని. అంతే ప్రతి వెధవకు లోకువే. మామూలుగా ఉండే ఆడపిల్లలకు అంటే తండ్రిగానీ, భర్తగానీ ఉండే వాళ్లకే రక్షణ అంతంతమాత్రంగా ఉంది. అలాంటిది. భర్త లేడని తెలిస్తే అడిగే వాడుండడని మరీ శృతిమించిపోతున్నారు" అంటూ నిర్మల విషయం చెప్పింది ఇందిర.

"మామయ్యా! నాక్కూడా ఇష్టం లేదు. నేను పుట్టిన నాటినుండీ అమ్మను ఒక దేవతలా చూసిన నేను, రేపు మరోవిధంగా చూడాలంటే బాధగానూ, భయంగానూ ఉంది. పైగా అమ్మకు పూలంటే చాలా ఇష్టం. అమ్మేంటి— ఏ ఆడపిల్లైనా ఇష్టపడుతుంది. చిన్నప్పటినుండి అలాగే పెంచుతాము. వాళ్లతో పాటు ఆ కోరికలు అలాగే పెరుగుతాయి. ఇప్పుడు ఈ బాధలో అలంకరాలెందుకు అనుకోవచ్చు. కానీ మళ్లీ రేపు బొట్టు పెట్టుకోవాలనిపించినా, పూలు ముడుచుకోవాలనిపించినా బలవంతంగా ఆ కోర్కెను చంపుకుని బ్రతకల్సి వస్తుంది. అందుకే ఆచారం పేరుతో అమానుషంగా ఏమీ చెయ్యవద్దు." ఆ ఇంటి పెద్దకొడుకు గిరిధర్.

"ఇన్నేళ్లలో మీ మాట ఎప్పుడు కాదనలేదు. ఏవీ అడగలేదు. ఎన్నిసార్లు సుమతిని గురించి మీరు బాధపడ్డారో నాకు తెలుసు. ఈ ఒక్క విషయం ఒప్పుకోండి" అర్థింపుగా అంది లీలావతి.



ఉదయాన్నే ఇద్దరు స్నేహితులు ఈ విధంగా మాట్లాడుకుంటున్నారు.

ఒకరు — రాత్రి నీవు నా కలలో కన్పించావోయ్.

రెండవవాడు: ఎప్పావులే! నేను రాత్రి ఊళ్ళోనే లేను. నీ కలలోకెలా వస్తాను?

— అబ్దుల్ గఫూర్ (మోర్తాడ్)

"అన్నయ్యా! చిన్నప్పటి నుండి నన్ను చూస్తూనే ఉన్నావు. మళ్ళీదాన్ని కూడా నాకు తోడుగా తీసుకురాకు. ఇవన్నీ చేస్తే అది తట్టుకోలేదు. అనుభవించిన దాన్ని చెప్తున్నాను. దీనికంటే సతీసహగమనం మేలనిపిస్తుంది. బ్రతికున్నా జీవచ్ఛవాన్ని చేస్తారు ఈ సంప్రదాయం పేరుతో. పైగా ఆ జీవచ్ఛవాన్ని చూస్తే అశుభం. అంటూ ఏ శుభకార్యానికి పిలువరు, రానివ్వరు. మనసు ఎంత గాయపడుతుందో ఆలోచించరు. అప్పుడూ, ఇప్పుడూ మనిషి ఒకరే అయినా, మరో మనిషి చావుకు ముడిపెట్టి బ్రతికున్న భార్యను మానసికంగా చంపేస్తున్నారు. అందుకే వద్దు ఇవేమీ దానికి చెయ్యొద్దు అంటూ ఏడ్చింది ఇందిర తల్లి. సుమతి.

"ఏం మామయ్యా? నీదగ్గర పెరిగిన నాకు, నీమనసు తెలుసు. మనం చేయదల్చుకున్నది మంచిపని అయినప్పుడు, ఎవరో, ఏదో అంటారని వెరవాల్సిన పనిలేదు. మరో వీరేశ లింగమో, రాజారామ్మోహనంరాయో రావాలంటేనే ఎలా? మనలోనే ఎవరో ఒకరు ముందడుగు వేస్తే ఎవరికీ నచ్చని ఈ సంప్రదాయాన్ని రూపుమాపేందుకు మన అడుగుజాడల్లో చాలామందివస్తారు" అంది ఇందిర.

"ఇంతమంది మీరు ధైర్యంగా నిలబడి మంచిచేస్తానంటే, నేను మాత్రం కాదని ఎలా అంటాను. వెళ్ళమ్మా! వెళ్ళి మీ పిన్నమ్మను ఆ బంధిఖానా నుండి విముక్తురాలిని చెయ్యి" అంటూ అభినందనగా ఇందిర భుజం తట్టాడు శ్యామసుందరం. "ఆనందంతో మనసు, గొంతులేయగా పరుగుతీసింది ఇందిర, అనుసరించారు కాత్యాయని, లీలావతి, సుమతి.

* * *

బాబాయి చనిపోయారంటూబాధపడుతూ వెళ్ళిన ఇందిర, ఆనందంగా తిరిగిరావడం చూసిన చాలామంది 'ఏమిటని' అడిగారు, బాబాయి చనిపోవడం బాధేకానీ, అంటూ జరిగిన విషయం వివరించింది ఇందిర. సంతోషంగా.

"పిదపకాలం" అంటూ మూతులు విరిచారు కొందరు.

'హమ్మయ్య! దిక్కుమాలిన ఆచారానికి నీళ్ళొదిలే రోజు మొదలైంది' అనుకున్నారు. చాలామంది.

* * *

"ఏం నిమ్మీ! అంత చిన్న ఊరులో ఇన్నాళ్ళూ ఆచారాలు, సంప్రదాయాలు అంటూ వేళ్ళాడిన వాళ్ళే ఈ దుస్సంప్రదాయానికి ఎదురునిల్చారు". మరి నీమాటేమిటి అన్నట్లు చూసింది ఇందిర.

"మా ఇంట్లో ఒప్పుకోరేమో" అంది నిరాశ,నిస్పృహ ముప్పిరిగొనగా నిర్మల.

"ఒప్పుకుంటేనే... అని కాదు. ధైర్యం చెయ్యమంటున్నాను. ఇంటాబయట వేధింప బడుతున్నది నీవు. ఇవన్నీ పెట్టుకుంటే రక్షణ వస్తుందని కాదు. కొంతవరకైనా తిప్పలు తప్పుతాయని "నచ్చచెప్తున్నట్లుగా అంది, ఇందిర. "ఇన్ని రోజులు బొట్టు, పూలు, గాజులు అన్నీ మానేసి, ఇప్పుడు సింగారించుకుంటే మళ్ళీ ఈవిడకు పెళ్ళి మీద ఆశ కల్గిందని అపార్థం చేసుకుంటారేమో" నసిగింది నిర్మల.

"పోన్లే, అలా అనుకున్నా తప్పులేదు. నాఈడుదానివి. నాకింకా పెళ్ళేకాలేదు. నీకప్పుడే అన్ని ముగిసిపోయాయి. బ్రతికినంతయిలానే ఉంటావా? మంచి మనసున్న మనిషి మళ్ళీ నీచేయి అందుకని తోడుగా ఉంటానంటే అంతకంటే ఇంకేం కావాలి" అంది ఇందిర తనపట్టువదలకుండా నిర్మలకు ధైర్యం చెప్తున్న ధోరణిలో "ఏమో! నాకు భయంగానే వుంది" అంది నిర్మల. రాత్రంతా ఆలోచనలతో గడిపేసింది నిర్మల.

* * *

"అసతోమా సద్గమయా..." నిర్మల గొంతు వినిపించి పూజగదిలోకి వెళ్ళిన అనసూయమ్మ కూతురిని చూసి విస్తుపోయింది. సమాజానికి వెరసి ఎప్పుడూ ఎటువంటి భావాన్ని వ్యక్తీకరించని ఆతల్లి కూతురిని చూసి మనసులోనే ఆనందపడింది. ఇన్ని రోజులు తనకూతురు ప్రార్థన విన్న ఆ భగవంతుడు అసత్యమనే భ్రాంతిలో బ్రతుకుతున్న తనకూతురును సత్యపథం వైపుకు నడిపించినందుకు ఆదేవునికి మనసులోనే అంజలి ఘటించింది, అనసూయమ్మ.

నిర్మలలో మార్పును గమనించిన ఇరుగు — పొరుగు సమాజం చేసిన అన్యాయాన్ని వెక్కిరిస్తూ వెళ్తున్న నిర్మలను చూసి ముక్కున వేలేసుకున్నారు, చెవులు కొరుక్కున్నారు.. కానీ భవిష్యత్తులో దురదృష్టవశాత్తూ తమ పిల్లలకు ఇలాంటి పరిస్థితి ఎదురైతే వేలెత్తి చూపించిన ఆ అమ్మాయినే ఆదర్శంగా తీసుకుంటారు. ఎందుకంటే అన్యాయం జరిగింది "తమ" పిల్లలకు కనుక.

* * *

నిర్మలనుచూసి ఆశ్చర్యపోయింది రమ. ఇందిరకళ్ళు ఆనందభాష్పాలు కురిపిస్తున్నాయి. భాష కందని భావం నిర్మల కళ్ళల్లో. మాటల కందని ఆనందం ఇందిర కళ్ళల్లో. ●